క్లుప్తంగా

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



పెబ్బేరు: మండలంలోని కొత్త సూగూర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా చేశారు. ఈ సందర్భంగా 10 మంది ఉపాధ్యాయులైన విద్యార్థులు తరగతి గదిలో తమతోటి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ జూదం వెంకటేష్, ప్రధానోపాధ్యాయులు దయానంద్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఉపాధ్యాయురాలు రజితమ్మ, అంగన్‌వాడీ టీచర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తిని గుర్తుంచుకోవాలి



వీపనగండ్ల: ప్రజాప్రతినిధులు, విద్యార్థులు సంఘ సంస్కర్తల ఉద్యమ స్ఫూర్తిని గుర్తించుకోవాలని, ఎందరో నాయకుల పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, ప్రతి ఒక్కరూ ఈ విషయాలను గుర్తించి రాష్ట్ర అభివృద్ధి పాటుపడాలని బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌రెడ్డి, గోపి, బాలు అన్నారు. మంగళవారం ఆనాటి ఉద్యమంలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్న దృశ్యాలతో పొందుపరిచిన క్యాలెండర్లను వారు మండల కేంద్రంలో ఇంటింటికీ పంపిణీ చేశారు.

శ్రద్ధగా చదువుకోవాలి

గోపాల్‌పేట: విద్యార్థులు చదువుపై దృష్టి సారించి పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చాలని జీసీడీఓ సుబ్బలక్ష్మి విద్యార్థులకు సూచించారు. మంగళవారం ఆమె గోపాల్‌పేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. అనంతరం పదో తరగతి, ఇంటర్ విద్యలో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేలా కృషి చేయాలని సీఆర్పీ, పీజీసీఆర్టీలకు సూచించారు. ఆమెతో పాటు ఎస్ఓ దీప్తి, సిబ్బంది ఉన్నారు.

జములమ్మ ఉత్సవాలు



అమరచింత: మండల కేంద్రంలో మంగళవారం జములేశ్వరి మాత ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి భక్తులు తండోపతండాలుగా హాజరై అమ్మవారికి పొటేళ్లను బలి ఇచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయంలో భక్తులు పూనకాలతో ఊగిపోతు జోగులే జోకో అంటు శివసత్తులు నాట్యం చేశారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు మంగలి నరసింహులు సౌకర్యాలను కల్పించారు.

పరిశుభ్రతే ముఖ్యం



మదనాపురం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం యువకులు స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఉన్న కంపచెట్లతో పాటు చెత్త చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. కాలనీ పెద్దలు ప్రారంభించిన శ్రమదానం కార్యక్రమం తమకు ఎంతో ఉత్సాహం ఇచ్చిందని, అదే స్ఫూర్తితో నేటికీ కొనసాగిస్తున్నామని యువకులు రాజు, అనిల్, ఆనంద్, గని, సాయికుమార్, నాని తదితరులు తెలిపారు.

వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఆత్మకూర్: వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, సమస్యలన్నింటిని పరిష్కరించాలని వీఆర్ఏల సంఘం నాయకులు శ్రీనివాసులు, గోవిందు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆత్మకూర్‌లో తహసీల్దార్ సింధూజకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు బడ్జెట్ సమావేశాల్లో వీఆర్ఏల పేస్కేలు అమలు చేయాలని, వారసులకు ఉద్యోగాలు, ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద, 2న వనపర్తిలోని కలెక్టరేట్ వద్ద మౌనదీక్ష చేపట్టనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాగేంద్రం, గట్టన్న, నయ్యూం, పరశురాం, శ్రీనివాసులు, రాములు, మోసీన్, మాసన్న, కుర్మన్న, భీమన్న, తిమ్మక్క, లక్ష్మి, పావని, మాసన్న, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

లోన్ యాప్‌లపై అప్రమత్తం



మామిడిమాడలో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేష్‌గౌడ్

అమరచింత: వివిధ రకాలుగా ప్రజలకు యామమాటలు చెప్పి వారి నుంచి డబ్బులు, బంగారు నగలను దోచుకెళ్లే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శివనాగేశ్వరనాయుడు అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో తహసీల్దార్ అధ్యక్షతన సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో లోన్‌యాప్ ద్వారా మోసాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. ఎవరూ మనకు ఉచితంగా డబ్బులు ఇవ్వరని, అత్యాశకు పోయి లోన్ యాప్‌ల బారిన పడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అలాంటి ఫోన్‌కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ద్విచక్ర వాహనాలను నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌లతో పాటు సంబంధిత పత్రాలను వెంట ఉంచుకోవాలని కోరారు. మైనర్లకు వాహనాలను ఇస్తే యాజమానులకు శిక్షలు తప్పవని హెచ్చరించారు. బ్యాంక్ అధికారులమంటూ ఎవరైన ఫోన్ చేసి మీ బ్యాంక్ అకౌంట్ నంబర్, ఏటీఎం కార్డు పిన్ నంబర్ అడిగితే చెప్పరాదన్నారు. అనంతరం తహసీల్దార్ చాంద్ పాషా మాట్లాడుతూ అపరచితులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వివక్ష చూపితే చర్యలు

పాన్‌గల్: గ్రామాల్లో ప్రజలు కలిసిమెలిసి ఉండాలని, ఎవరి పట్లనైన వివక్ష చూపితే వారిపై కఠిన చర్యలు తప్పవని డీటీ చక్రపాణి హెచ్చరించారు. మంగళవారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్నారం పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ ఎస్సీల పట్ల వివక్ష చూపించొద్దన్నారు. ఎస్సీ కాలనీల్లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములు, ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వీఆర్ఏ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



అన్నారంలో మాట్లాడుతున్న డీటీ చక్రపాణి



అమరచింతలో..

చట్టాలు అందరికీ సమానం

ఆత్మకూర్: చట్టాలు ఎవ్వరికి చుట్టాలు కావని, అందరికీ సమానమని ఏఎస్ఐ బీచుపల్లి అన్నారు. మంగళవారం మండలంలోని రేచింతలలో సివిల్‌రైట్స్ దినోత్సవంలో భాగంగా పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అంటరానితనం అమానుషమని, రెండు గ్లాసుల పద్ధతికి స్వస్తి పలకాలని, కులాల పేరిట ద్వేషించడం చట్టవిరుద్ధమని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవాంఛిత ఫోన్ కాల్స్‌కు స్పందించి ఓటీపీ చెప్పకూడదని తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ నర్సింహులు, ఇంచార్జీ సర్పంచ్ సరోజ, ఉపసర్పంచ్ నర్సింహ, ఎంపీటీసీ సభ్యురాలు అలివేలమ్మ, మాజీ జెడ్పీటీసీ బాలకిష్టన్న, భీసన్న, రఘు, భాస్కర్, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటేష్‌గౌడ్ అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని మామిడిమాడ ఉన్నత పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు చదువు యొక్క ప్రాముఖ్యత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఖాతా నెంబర్, ఓటీపీ, ఏటీఎం పిన్ అడిగితే చెప్పరాదని సూచించారు. ఈ విషయాలపై తల్లిదండ్రులకు విద్యార్థులు అర్థం అయ్యేలా చెప్పాలన్నారు. ఎవరైనా మోసానికి పాల్పడుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే 1930 లేదా 100 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం తగదు

చిన్నంబావి: కొల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులపై జరుగుతున్న నిర్లక్ష్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాని మాజీ మంత్రి జూపల్లి తన అనుచరులకు సూచించారు. మండలంలోని వెలగొండ, మియాపూర్, బెక్కం, పెద్దదగడ గ్రామాల్లో ముఖ్య కార్యకర్తలతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు చిన్నంబావిని మండల కేంద్రంగా తీర్చిదిద్ది అభివృద్ధి చేశానని, చిన్నంబావి మండలంలోని గ్రామాల్లో చేసిన అభివృద్ధితో పాటుగా కొల్లాపూర్ నియోజకవర్గ రైతాంగానికి సాగు నీటి కోసం కృషి చేశానన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినా.. ఇప్పటికీ పనులు మొదలు పెట్టకుండా ఎమ్మెల్యే బీరం నిర్లక్ష్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇదే విషయాన్ని ఆయా గ్రామాల్లో గడపగడపకు తీసుకెళ్లి ప్రజలకు ప్రజలకు వివరించాలని దిశానిర్దేశం చేశారు.

అక్రమ కేసులతో వేధింపులు

రెండు దశాబ్దాలుగా ప్రశాంతంగా ఉన్న కొల్లాపూర్‌లో ఈ రోజు అమాయకపు ప్రజలపై అక్రమ కేసులు, దాడులతో ఫ్యాక్షనిజాన్ని తెస్తున్నారని మండిపడ్డారు. తాను రాజకీయాలకతీతంగా కొల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశానని, కానీ నేడు కొందరి స్వార్థం వల్ల కొల్లాపూర్‌లో అభివృద్ధి మరుగున పడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ కష్ణప్రసాద్‌యాదవ్, బీచుపల్లి యాదవ్, సర్పంచ్‌లు సురేందర్ సింగ్, రంజిత్‌కుమార్, ఎంపీటీసీ మహాదేవ్‌గౌడ్, వమాన్ బిచ్చన్న, నాగరాజు, కురుమూర్తి, నరసింహ, కుర్మయ్య, శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

నేటినుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వెంకటగిరి ఆలయం

- వెంకటగిరి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి
- ఈనెల 3న స్వామివారి కల్యాణం
- 5న రథోత్సవం



ఉత్సవ విగ్రహాలు

కొత్తకోట: మండలంలోని కొత్తకోట, కానాయపల్లి, నిర్వేన్, పాలెం గ్రామాల మధ్య వెలసిన వెంకటగిరి భూలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు ముస్తాబు అయింది. భక్తుల మొకోరికలు తీరుస్తూ పూజలందుకుంటున్న కలియుగ దైవం వేంకటేశ్వరుడు వెలసిన ఆలయం వెంకటగిరి. అలివేలు మంగ, పద్మావతి సమేతుడై ఒకే శిలపై స్వయంభుగా వెలిశాడని ఆలయ పూజారులు చెప్పారు. వనపర్తి ఆస్థాన కవివర్యులు మణామణి శ్రీనివాసదేశికాచార్యులు సుమారు 150ఏళ్ల క్రితం స్వామి వారి గురించి ఒక గ్రంథం రాశారు. దానిలో స్వామి వారు ఈ గుట్టపై ఒక పుట్టలో సుమారు 460ఏళ్ల క్రితం ఆదిలక్ష్మి, అనంతలక్ష్మి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి స్వయంభువుగా వెలిసినట్లు ప్రస్తావించారు.. ఒకే శిలపై అమ్మవార్లు, స్వామి ఉండడం ఇక్కడ విశేషంగా చెబుతారు. అప్పటి సూగూరు సంస్థానం రాజు శ్రీ వెంకటరెడ్డి అదే గుట్టపై స్వామికి ఆలయం నిర్మించడంతో దానికి ఆయన పేరుగా 'వెంకటగిరి' నామకరణం చేశారు.

చిలుకూరి బాలాజీతో పోలిక

ఈ ఆలయానికి, చిలుకూరి వేంకటేశ్వరుడి ఆలయానికి దగ్గరి పోలికలు ఉండడం, మూల విగ్రహాలు రెండు ఆలయాల్లో ఒకేలా ఉండటం విశేషం. వెంకటగిరి గుట్టపై 1648 సంవత్సరంలో ఈ ఆలయాన్ని నిర్మించారు.

బ్రహ్మోత్సవ కార్యక్రమాలు

ఈనెల 1న సుప్రభాతసేవ, వాసుదేవపుణ్యావచనము, అంకురార్పణ, 2న ధ్వజారోహనం, బేరిపూజ, దేవతాహోమం, కంకణధారణ, 3న మాఘ శుద్ధ త్రయోదశి ఉదయం 11:30 గంటలకు ఆదిలక్ష్మి అనంతలక్ష్మి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, 4న హోమం, బలిహరణ, 5న రథోత్సవం, ధ్వజారోహణం, జాతర ఉత్సవాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ప్రజాభిప్రాయంతో అభివృద్ధి పనులు

వనపర్తి: కొంతకాలంగా వివాస్పదంగా మారిన సబ్ రిజిస్ట్రార్ భవన నిర్మాణం పనుల విషయంలో మున్సిపల్ పాలకవర్గం మరోసారి పునరాలోచించాలని అఖిలపక్ష ఐక్యపక్షవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ డిమాండ్ చేశారు. కొత్తకోట రోడ్డులోని గుట్టల వద్ద, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లబ్ధి చేకూర్చేందుకు భవన నిర్మాణం చేయడానికి సిద్ధమయ్యారని మంగళవారం జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఐక్యవేదిక సభ్యులు ఆందోళన చేపట్టారు. సబ్ రిజిస్ట్రార్ భవన నిర్మాణ పనులను వెంటనే నిలిపి వేసి, ఈ ప్రాంత ప్రజలకు నష్టం లేని ప్రదేశంలో కార్యాలయ నిర్మాణం చేపట్టాలని కోరారు. ప్రజలకు అసౌకర్యంగా ఉండే చోట ప్రభుత్వ కార్యాలయం నిర్మాణం చేస్తే.. ప్రజల మద్దతుతో ఆందోళన ఉధృతం చేస్తామని, గుట్టల వద్ద సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణాన్ని అధికార పార్టీ కౌన్సిలర్లు సైతం సుమారు 17 మంది వ్యతిరేకిస్తూ, మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ విషయంపై రిజిస్ట్రేషన్ శాఖ స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు వెంకటేశ్వర్లు, రాములు, రమేష్, గోపాలకృష్ణ, నరసింహ్మా, సుధాకర్, రామన్‌గౌడ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సబ్ రిజిస్ట్రార్ కిస్టఫర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

వీపనగండ్ల: మండలంలోని తూంకుంటకు చెందిన కటారీ కృష్ణయ్య(50) తప్పిపోయినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామన్‌గౌడ్ తెలిపారు. మతిస్థిమితం లేకపోవడంతో ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా తరుచూ గ్రామం విడిచి వెళ్లేవాడని భార్య చంద్రకళ తెలిపారు. తప్పిపోయిన వ్యక్తి వద్ద కనీసం ఫోన్ కూడా లేకపోవడంతో సమాచారం తెలియడం లేదని, జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సమాచారాన్ని పంపించి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని ఎస్ఐ పేర్కొన్నారు. తప్పిపోయిన వ్యక్తిని గుర్తించి తమకు అప్పగించాలని భార్య చంద్రకళ పోలీసులను వేడుకున్నారు.

ప్రజలకు సేవలందించే అవకాశం రావడం అదృష్టం

ఖిల్లాఘనపురం: సమాజంలో ప్రజలకు సేవ అందించే అవకాశం రావడం ఒక అదృష్టమని ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. ఉత్తమ సేవలకు గాను ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ యాస్మీన్‌బాష చేతుల మీదుగా ఉత్తమ అధికారులుగా అవార్డులు అందుకున్న ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎస్ఐ వెంకటేష్‌గౌడు తదతరులకు మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచు వెంకటరమణ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు క్యామ వాణి, ఆశాజ్యోతి, ఉప సర్పంచ్ యాదయ్య, పంచాయతీ కార్యదర్శి రవితేజ తదితరులు పాల్గొన్నారు.



జీపీల సమస్యలు పరిష్కరించాలని వినతి

పాన్‌గల్: గ్రామ పంచాయతీల్లో సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి పాన్‌గల్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల సర్పంచ్‌ల సంఘం నాయకులు మాట్లాడుతూ జీపీల్లో చేసిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంలో జాప్యం జరుగుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దీంతో పాటు ఎల్ఈడీ బల్బుల ఏర్పాటును సర్పంచ్‌లకే అధికారం ఇవ్వాలని కోరారు. ఆయా సమస్యలను పరిష్కరించేలా జిల్లా అధికారులకు సూచిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం నాయకులు గోపాల్‌రెడ్డి, వెంకటయ్యయాదవ్, నాగేష్‌నాయుడు, బాలస్వామియాదవ్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్యానాయక్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

రైతు సంక్షేమం కోసమే పశువైద్య శిబిరాలు

పెబ్బేరు: మండలంలో జనుంపల్లి, పెంచికలపాడు, ఈర్లదిన్నె గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ క్యాంపు ద్వారా పశువైద్య శిబిరాన్ని మంగళవారం ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పీవీ నరసింహారావు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ద్వారా పశువైద్య శిబిరాలను గ్రామాల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. రైతులు తమ జీవాలకు వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని సూచించారు. 489 పశువులకు ఉచితంగా మందులు, ఆరోగ్య, గర్భనిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సునీత, రైతుబంధు అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు రాజవర్ధన్‌రెడ్డి, గోవిందునాయుడు, పద్మ, నాయకులు కట్ట శ్రీనివాస్‌రెడ్డి, రాధాకృష్ణయాదవ్, జిల్లా పశువైద్య, పశుసంవర్థ శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, పశువైద్య డాక్టర్లు మాధవి, యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్లు వెంకటరమణ, అనిల్, రవి, గోపాలకృష్ణ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



జనుంపల్లిలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ముమ్మరంగా 'కంటివెలుగు' కార్యక్రమం

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం డీఆర్‌డీఏ ఏపీడీ రేణుక సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, ఈ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని ఏపీడీ కోరారు. కంటి శిబిరానికి ప్రజలు వచ్చే విధంగా మండల మహిళా సమాఖ్య సభ్యులు, గ్రామ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, బుక్ కీపర్లు మహిళలను చైతన్య పరచాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి, సీసీ వీరయ్య, బుక్ కీపర్ రవీందర్, బాలీశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



వీపనగండ్లలో కంటి పరీక్షల వివరాలను తెలుసుకుంటున్న ఏపీడీ రేణుక

506 మందికి..

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు అన్నారంతండా, మాందాపూర్ గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం 506 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్ రెడ్డి తెలిపారు. ఈ పరీక్షల్లో 44 మందికి కంటి అద్దాలు, 10 మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం సిఫార్సు చేసి అవసరమైన వారికి మందులను పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని అన్నారంతండాలోని కంటి వెలుగు కేంద్రాన్ని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో తండా సర్పంచ్ రంగానాయక్, కంటి వైద్య నిపుణులు, అప్తాలమిస్టులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెబ్బేరు: మండలంలోని అయ్యవారిపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరం మంగళవారం ముగిసింది. గ్రామంలో 1,656 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. 123 మందికి వెంటనే కంటి అద్దాలు ఇవ్వడంతో పాటు 181 మంది కంటి అద్దాలు అందిచాల్సి ఉందని, కంటి ఆపరేషన్‌కు 26 మందిని గుర్తించామని వైద్య అధికారి డాక్టర్ రాకేష్‌రెడ్డి తెలిపారు. అనంతరం గ్రామస్తులు వైద్యులను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ అక్కి స్వాతి, ఉప సర్పంచ్ మద్దిలేటి, కంటి వైద్య అధికారి సుధారాణి, క్యాంప్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బమ్మ, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి రేణుక, ఏఎన్ఎంలు శకుంతల, విజయ, ఆప్తమాలిస్ట్ నాగరాజు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ తదితరులు పాల్గొన్నారు.

138 మందికి..

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని శేరుపల్లి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీడీఓ ప్రసన్నకుమారి పరిశీలించారు. గ్రామంలో 138 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా.. వారిలో 11 మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ చేశామని, పది మందికి అద్దాల తయారీకి పంపిచామన్నారు. ఇద్దరిని ఆపరేషన్ అవసరం ఉన్న వారిగా గుర్తించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పవన్‌కుమార్, ప్రియాంక, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్ఎం అనురాధ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో..



అయ్యవారిపల్లిలో..



శేరుపల్లిలో..

ధ్వజస్తంభానికి పూజలు



పెబ్బేరు: మండలంలోని రంగాపూర్‌లో చింతల వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠకు ఘనంగా పూజలు నిర్వహించారు. అలాగే స్వామి వారికి వేద పారాయణం, చతుస్థానార్చన, క్షీరాధివాసము, సుదర్శన నారసింహ సహిత లక్ష్మీవేంకటేశ్వర హవనం, నిత్యపూర్ణాహుతి, కర్మంగ స్నపనం, శాత్తుమైరై తీర్థగోష్టి చేశారు. అనంతరం గ్రామంలో స్వామివారిని ఊరేగింపు తీశారు. అభిషేకాలు చేసి అధివాసహోమం యంత్రశకృది, హోమాలు తదితర కార్యక్రమాలు చేశారు. బుధవారం ధ్వజస్తంభం, బొడ్రాళ్లు, గండదీపం, నవగ్రహాలు, గణపతి, గరుడ, బలిపీఠ, ప్రతిష్ఠ కార్యక్రామాలు నిర్వహిస్తామన్నారు.

విద్యుత్ కోతలు సరికాదు



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట విద్యుత్ కోతలపై మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విద్యుత్ ఇస్తామని రాతివేళలో అస్తవ్యస్తంగా సమయంలో విద్యుత్ సరఫరా చేయడంలో వ్యవసాయ బోరుమోటార్ల వద్ద తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కనీసం 12 గంటల పగటిపూట సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఏఈ కవితకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రాములు, రంజిత్‌కుమార్, సత్యనారాయణ, సురేందర్‌గౌడ్, సర్వేష్, సునీల్‌కుమార్, రణధీర్‌రెడ్డి, వీరస్వామినాయుడు, నరసింహానాయుడు, మాజీ డైరెక్టర్ రాములు, జాంగీర్ ఉన్నారు.